క్లుప్తంగా

గ్రామాల్లో తాగునీటి క్లోరినేషన్



క్లోరినేషన్ చేయిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఆరోగ్యశాఖ సిబ్బంది

మద్దిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటిని వైద్యారోగ్యశాఖ సిబ్బంది క్లోరినేషన్ చేయించారు. ఆస్పత్రి డాక్టర్ శ్రావణ్ పర్యవేక్షణలో హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య వైద్యారోగ్య శాఖ సిబ్బందితో కలిసి నందిపాడు ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద ఉన్న సంప్‌లో నీటిని క్లోరినేషన్ చేయించారు. తాగునీరు కలుషితం కాకుండా నీటి సంబంధిత డయేరియా వంటి జబ్బులు రాకుండా క్లోరినేషన్ చేయిస్తున్నట్లు సూపర్‌వైజర్ తెలిపారు. ప్రతి గ్రామంలో తాగునీటిని క్లోరినేషన్ చేసే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు ఆయన తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శివ దుర్గ, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

27న సదస్సు జయప్రదం చేయాలి

ఒంగోలు: కాకినాడలో అంబేద్కర్ ఆలోచన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహించే రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజాయితీ గల నాయకత్వం, సమాజ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చగలిగే నమ్మకం కలిగించే దిశగా సమాజంలో మార్పుకోసం గత రెండు దశాబ్దాలుగా ఏఎఎఫ్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఉద్యమిస్తోందన్నారు. అందులో భాగంగా ఈనెల 27న రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతుందన్నారు. భవిష్యత్ ఆంధ్రప్రదేశ్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్, రూల్ ఆఫ్ లా అమలు కావడానికి న్యాయవాదులు, మేధావులు, యాక్టివిస్టులు, అభ్యుదయ వాదులు సంఘటితం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్, రూల్ ఆఫ్ లా అమలుకోసం సమాజంలో మార్పుకోసం పినిపే రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సులో అంబేద్కర్, పూలే, పెరియార్, కాన్షీరాం వారసులు, మేధావులు, అభ్యుదయ వాదులు పాల్గొని భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఎయిడెడ్ పాఠశాలల్లో పదోన్నతులు కల్పించాలి

ఒంగోలు: ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న సంస్కృతం, తెలుగు, హిందీ , పీఈటీలకు పదోన్నతి సౌకర్యం కల్పించాలని ఏపీ టీచర్స్‌గిల్డ్ రాష్ట్ర అధ్యక్షుడు బి.చిట్టిబాబు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే సంస్కృత పండితులు, తెలుగు, హిందీ, పీఈటీలు గ్రేడ్ 2గానే ఆరో తరగతి నుంచి పదో తరగతివరకు అన్ని తరగతులకు బోధన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే పండిట్లను కూడా అప్‌గ్రేడేషన్ చేసి వారికి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు.

కౌలు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలి



వీఆర్‌ఓలు, వీఏఏలతో సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: కౌలు రైతులను గుర్తించి ప్రతి ఒక్కరికీ పంటసాగు హక్కు పత్రం ఇవ్వాలని వీఆర్ఓ, వీఏఏలను వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్‌బాబు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఒంగోలు మండల గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు సీసీఆర్‌సీపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఏఏలంతా తమ పరిధిలోని కౌలు రైతులను గుర్తించి వారిని వీఆర్ఏల వద్దకు పంపించాలని సూచించారు. నూరు శాతం కార్డులు పంపిణీ చేయాలని చెప్పారు. కౌలు రైతు అర్హతలు, పంటసాగు హక్కు పత్రం పొందేందుకు పాటించాల్సిన నియమ నిబంధనలను అర్బన్ తహసీల్దార్ ఎం.సుజన్ కుమార్ వివరించి చెప్పారు. కౌలు రైతు చట్టం- 2019 గురించి మండల వ్యవసాయాధికారి కిషోర్‌బాబు తెలిపారు. ఈ చట్టంతో భూ యజమానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఈ కార్డు కాల పరిమితి కేవలం 11 నెలలు మాత్రమే ఉంటుందని చెప్పారు. ఈ చట్టం ప్రకారం కౌలు రైతుకు కేవలం పంట మీద మాత్రమే హక్కు ఉంటుందన్నారు. భూమి మీద ఎలాంటి హక్కు ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఒంగోలు రూరల్ తహసీల్దార్ విజయ కుమార్, డీటీ అజయ్‌కుమార్‌రెడ్డి, మండల వీఆర్వోలు, మండల వ్యవసాయశాఖ ఏఈఓలు పాల్గొన్నారు.

బాబు మాట అబద్ధాల కోట

- రూ. 15 వేల కోసం ఆశగా ఎదురు చూపులు
- ఎన్నికల సమయంలో ప్రతి చదువుకునే బిడ్డకు రూ. 15వేలుగా ప్రకటన
- జీవో జారీతో కొనసాగుతున్న అస్పష్టత



టీడీపీ మేనిఫెస్టో

ఒంగోలు: తల్లికి వందనం సంగతి అటువంటి తల్లి వందనం చేసే పరిస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలో టీడీపీ 1 నుంచి 12 తరగతులు చదువుకునే ప్రతి ఒక్కరికీ నగదు ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో పేద తల్లులు ఆశపడ్డారు. ఓట్లను కూటమికి దంచి కొట్టారు. అయితే జూన్ నెలలో విడుదల కావాల్సిన నిధులు విడుదల కాకపోవడం, అమ్మ ఒడి పథకం పేరు కాస్తా తల్లికి వందనం పేరు మార్పుతో సరిపెట్టడంతో తల్లుల్లో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం ప్రతి బిడ్డకు రూ. 15వేలు ఇస్తారన్న భరోసాతో తమ పిల్లలను కార్పొరేట్ స్కూళ్లలో చేర్పించిన వారిలో ఆందోళన నెలకొంది.

సామాజిక మాధ్యమాల్లో చర్చ

జీవో జారీలో కొంత స్పష్టత లేకపోవడంతో అయోమయం నెలకొంది. తల్లులకు రూ. 15వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని పేర్కొంటూ ఉత్తర్వులు రావడంతో ఒక బిడ్డకా.. లేదా కుటుంబంలోని పిల్లలందరికీ జమచేస్తారా అనేది సందిగ్ధంగా మారింది. పూర్తి విధి విధానాలను త్వరలో ప్రకటిస్తామని చెబుతున్నా జీవో జారీతో గందరగోళం నెలకొంది. దీనిపై సామాజిక మాధ్యమాల్లో చర్చ కొనసాగుతోంది.

ఒంగోలులో ప్రైవేటుదే ఆధిపత్యం

జిల్లా కేంద్రం కావడంతో ఒంగోలులో ప్రైవేటు పాఠశాలల ఆధిపత్యం స్పష్టం. నగరం, ఒంగోలు మండలం, కొత్తపట్నం మండలం వెరసి నియోజకవర్గంలో 1 నుంచి 10 తరగతులు అభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య 44,400. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించేవారు 13,000 మంది కాగా, ప్రైవేటులో విద్యను అభ్యసిస్తున్నవారి సంఖ్య 31,400. ప్రభుత్వ విద్యార్థులకు మాత్రమే పథకాన్ని వర్తింపజేస్తే కేవలం 13వేల మంది విద్యార్థులకు మాత్రమే పథకం వర్తిస్తుంది. దీనివల్ల 31400 మందికి అన్యాయం జరిగినట్లు అవుతుంది. సంతనూతలపాడు నియోజకవర్గంలో 16 వేల మంది ప్రభుత్వ విద్యను అభ్యసిస్తుంటే 14500 మంది ప్రైవేటులో విద్యను అభ్యసిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లో కలిపి 74900 మంది, మరో 30 వేలమంది ఇంటర్ విద్యార్థులుంటారని అంచనా. మొత్తం 1,04,900 కాగా వీరిలో 75 శాతంమంది పథకానికి అర్హులైతే 78675 మందికి వర్తించాలి. అంటే రూ. 118 కోట్లు ఖాతాల్లో జమ కావాలి.

సురక్షిత నీటితో డయేరియా నివారణ



డయేరియాపై అవగాహ కల్పిస్తున్న డాక్టర్ వైష్ణవి

కొత్తపట్నం: వ్యక్తి పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రతగా ఉంచుకొని సురక్షితమైన నీరు తాగడం వల్ల డయేరియా వ్యాధి నివారించవచ్చని కొత్తపట్నం పీహెచ్ డాక్టర్ వైష్ణవి అన్నారు. జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో డయేరియా ఏ విధంగా ఎదుర్కోవాలి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వైష్ణవి మాట్లాడుతూ వాతావరణ మార్పులు వలన తాగు నీరు కలుషితమై ప్రజలకు వాంతులు, విరేచనాలు, అతిసారం వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. గ్రామాల్లో బ్లీచింగ్ క్లోరినేషన్ చేసిన కుళాయి నీటిని మాత్రమే తాగాలని సూచించారు. మల విసర్జనకు మరుగు దొడ్లను మాత్రమే వాడుకోవాలని వివరించారు. నీటి నిల్వలు ఉన్న చోట దోమలు గుడ్లుపెట్టి దోమలు ఉత్పత్తి అవుతాయని కనుక వారానికి ఒక సారి నీటి తొట్టెలను, పాత్రలు, డ్రమ్ములు శుభ్రం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆహార పదార్థలపై ఈగలు వాలకుండా మూతపెట్టుకోవాలని, భోజన సమయంలో మూతలు తీసి వాడుకోవాలన్నారు. ఆకుకూరలు నీటితో శుభ్రం చేసుకుని ఉడకపెట్టి మాత్రమే ఆహారంగా తీసుకోవాలని వివరించారు. ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు అంగన్‌వాడీ కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్స్, జింక్ ట్లాబెట్స్ ఉంచుకోవాలని చెప్పారు.

కొత్తపట్నం హైస్కూల్‌లో..

స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య మాట్లాడుతూ వ్యక్తి పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశ్రుతగా ఉంచుకొని సుర‌క్షితమైన నీరు తాగడం వల్ల డయేరియా వ్యాధి నివారించవచ్చున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని సీజన్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచిచల్లార్చిన నీటిని తాగడం వల్ల పలు రకాల వ్యాధులను దూరం చేసుకోవచ్చున్నారు. జలజీవన్ మిషన్ ప్రాజెక్ట్ మేనేజర్ సుధీర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పరిసరాల పరిశుభ్రతపై వైద్య సిబ్బందిచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్కూల్ హెచ్‌ఎం ఎం.శ్రీదేవి, డాక్టర్ రమ్యదీపిక, జలజీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్లు రవి.కేశవరావు, సీహెచ్‌వో ఓంకార్, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో పలువురు విద్యార్థులకు సీట్లు



చందలూరి సాయి భార్గవ్



చిట్టిమాల నితీష్



కందుకూరి సుమశ్రీ



గోళ్ల సాత్విక్



ఎండ్లూరి సిరివెన్నెల

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు, గుండ్లాపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన చిట్టిమాల నితీష్ 562 మార్కులు సాధించగా, ఇనమనమెళ్లూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన సాయి భార్గవ్‌కు 573 మార్కులు వచ్చాయి. వీరిద్దరికీ శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీట్లు దక్కాయి. వీరికి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మాచవరం పాఠశాల విద్యార్థులకు...

నాగులుప్పలపాడు (మద్దిపాడు): నాగులుప్పలపాడు మండలంలోని మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. పాఠశాలలో పదో తరగతి చదివిన కందుకూరి సుమశ్రీ 587 మార్కులు సాధించగా, గోళ్ల సాత్విక్ 565 మార్కులు సాధించాడు. వీరికి ట్రిపుల్ ఐటీలో సీట్లు రావడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరామ ప్రసాద్ అభినందనలు తెలిపారు. సుమశ్రీకి నూజివీడు క్యాంపస్‌లో సీటు రాగా, సాత్విక్‌కు ఒంగోలులో సీటు వచ్చింది. వీరి తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయుడిని కలిసి తమ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉప్పుగుండూరు పాఠశాల విద్యార్థినికి...

నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు పాఠశాలలో పదో తరగతి చదివిన ఎండ్లూరి సిరివెన్నెల 561 మార్కులు సాధించింది. ఆమెకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీటు లభించింది. ఈమె తండ్రి గోపి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఒక ఆటో డ్రైవర్ కూతురు మంచి మార్కులతో పాసై ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. తాను సీటు సాధించడానికి సహకారం అందించిన ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులకు సిరివెన్నెల కృతజ్ఞతలు తెలిపింది.

జీజీహెచ్‌లో కులవివక్ష ?

- సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసిన దళిత నాయకులు



జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తున్న దళిత నాయకులు

ఒంగోలు టౌన్: కాసుల కక్కుర్తితో కొందరు జీజీహెచ్ ఆసుపత్రి వైద్యులు రోగుల పట్ల కుల వివక్ష చూపుతున్నారని, వారిని సస్పెండు చేయాలని దళిత సంఘాల నాయకులు నీలం నాగేంద్రరావు, సృజన్ మాదిగ, దారా అంజయ్య గురువారం జీజీహెచ్ సూపరెండెంట్ డా. దుర్గాదేవికి ఫిర్యాదు చేశారు. క్యాజువాలిటీలో కొందరు వైద్యులు చేస్తున్న అక్రమాలకు సంబంధించిన కొన్ని సాక్ష్యాలను ఆమెకు అందజేశారు. ఎస్సీ , ఎస్టీ బాధితులు గాయపడి ఆసుపత్రికి వస్తే చికిత్స చేయకుండా వెనక్కి పంపిస్తున్నారని, ప్రైవేటు వైద్యశాలలో చేరమంటూ సలహాలు ఇస్తున్నారని వివరించారు. ఎమ్మెల్సీ కేసులను నాన్ ఎమ్మెల్సీ కేసులుగా రిఫర్ చేయడం, ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకున్న కేసులను పోలీసులు, మధ్య వర్తుల ద్వారా రేటు మాట్లాడుకొని అర్ధరాత్రి బయటకు గెంటేస్తున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ బాధితులకు చికిత్స చేసిన వివరాలను ఔట్ పోస్టులకు రాత పూర్వకంగా సమాచారం ఇవ్వడంలేదని తెలిపారు. దీంతో వైద్య చికిత్సకు సంబంధించిన డాక్టర్ రిపోర్టు లేకుండా పోలీసు స్టేషన్లకు కేసు వివరాలను పంపించలేమంటూ ఔట్‌పోస్టు పోలీసులు చేతులెత్తేస్తున్నారని తెలిపారు. బల్లికురవ మండలం సూరేపల్లి కేసులో డాక్టర్ వ్యవహారశైలిని వివరించారు. క్యాజువాలిటీలో డ్యూటీ ఎప్రాన్ ధరించడం లేదని, మెడలో స్టెతస్కోపు లేకుండా సివిల్ డ్రెస్సుల్లో తిరుగుతున్నారని, ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డ్యూటీ డాక్టర్లు కొందరు రెస్ట్ గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆమె దృష్టికి తీసుకొని వచ్చారు. 2నెలల క్రితం కొందరు వ్యక్తులు మక్కెన వర కుమార్ అనే ఆటో డ్రైవర్‌పై దాడి చేశారని, నిందితులతో కుమ్మక్కయిన వైద్యులు ఆయనను ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకోకుండా వేధించారని తెలిపారు. ఆ తరువాత బాధితుడు గాయాలు, నొప్పులతో జీజీహెచ్‌లో చికిత్స కోసం చేరితే ఎమ్మారైలు, స్కానింగులు చేశారని ఓపీ చీటీలు, మెడికల్ రిపోర్టులను సూపరెండెంటుకు అందజేశారు. కాగా తగిన చర్యలు తీసుకుంటానని సూపరెంటిండెంట్ హామీ ఇచ్చినట్లు దళిత నాయకులు తెలిపారు. కాకుమాను రవి కుమార్, బాధితుడు వర కుమార్ పాల్గొన్నారు.

రంగభూమి వార్షిక సంబరాలు ప్రారంభం



అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయ కళాకారులు, నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం, ఒంగోలు వారి ఏడో వార్షిక సంబరాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో గురువారం ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన ఏకపాత్రాభినయం పోటీలు అలరించాయి. సాంఘిక జానపద, చారిత్రక, పాత్రలు, వాటికి సంబంధించిన అభినయంతో కళాకారులు ప్రేక్షకులను మైమరిపించారు. సింగరాజు రాంబాబు, ఎద్దు శశికాంత్ భూషణ్, ప్రారంభ సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు తమ మాటల్లోకళల వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేసే కార్యక్రమాలను, కళల ద్వారా, రచయితలు నటీనటులు, దర్శకులు బాహ్య సమాజంలోని ప్రజలకు చేర్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ కళాకారులన్నా, కవులన్నా విశేషగౌరవం భావాలు కలిగి ఉండాలని దామచర్ల తెలిపారు. జిల్లా కేంద్రంలో కళాక్షేత్రం నిర్మాణానికి ఆయన ఇచ్చిన ప్రోత్సాహాన్ని మరవలేమన్నారు. సినీ రచయిత పాటిబండ్ల ఆనందరావు, రంగభూమి అధ్యక్షుడు బేతంశెట్టి హరిబాబు, ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి ధేనువకొండ వెంకట సుబ్బారావు, బొమ్మరిల్లు నిర్వాహకురాలు పి. రాజ్యలక్ష్మి, రంగభూమి సంఘ సభ్యులు మాకా ఆంజనేయులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మందులు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఒంగోలు మెట్రో: వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గాంధీ రోడ్డు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో డాక్టర్ చావల ప్రకాష్ పర్యవేక్షణలో స్థానిక భక్తులకు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 50 భక్తులు పరీక్షలు చేయించుకున్నారు. ముఖ్య అతిథిగా తాతా ప్రసాద్ ప్రసంగించారు. గుర్రం రంగనాథ్, దర్శి మనోహర చంద్రశేఖర్, టంగుటూరి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో జాగ్రత్తగా లేకుంటే నష్టం తప్పదు

పెద్దదోర్నాల: మండల ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని చింతల వైద్యాధికారి డాక్టర్ యాగ్నిక్ పేర్కొన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో డెంగీ, డయేరియా, మలేరియాతో పాటు విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలకు అప్రమత్తంగా ఉండాలన్నారు. డెంగీ వ్యాధి టైగర్ దోమ వల్ల వ్యాపిస్తుందన్నారు. జ్వరం, తలనొప్పి, చలి, కళ్లు ఎర్రబడటం తదితర లక్షణాలతో పాటు రక్త కణాలు తగ్గి పోతాయన్నారు. వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించి వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. నీటి తొట్లు, టైర్లు తదితర వాటిల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



ర్యాలీ ప్రారంభిస్తున్న పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుందర్ ప్రసాద్

ఒంగోలు రూరల్: ఇద్దరు వద్దు..ఒకరు ముద్దు అని కరవది మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుందర్ ప్రసాద్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ జనాభా పెరిగిపోవటం వలన అన్ని దేశాలు ఆర్థిక స్థితిగతులు మారిపోతాయన్నారు. 2050వ సంవత్సరం నాటికి భూమి మీద పండించే పంట సంవృద్ధిగా నేటి జనాభాకే అందించలేమని ఆందోళన వ్యక్తం చేశారు. ధరలు పెరుగుదల, ధాన్యం, వస్తు వినియోగం పెరిగిపోవటం వలన అన్ని వర్గాల వారికి అందకుండా పోతాయని సంక్షేమ ఫలాలు దూరమవుతాయన్నారు. ప్రస్తుతం రైతులు పండించే ప్రసుత్త పంట దిగుబడి రెండింతలు అయితేనే అందించగలమన్నారు. ఆడ బిడ్డకు 18 సంవత్సరాలు, పురుషునికి 20 సంవత్సరాలు వచ్చే వరకు వివాహం చేయరాదని, ప్రపంచ జనాభా పెరుగుదలపై ప్రజలల్లో అవగాహన వైద్యారోగ్య శాఖతో పాటు, ప్రజలతో నిత్యం సంబంధం ఉండే సచివాలయ వ్యవస్థ కూడా చైతన్య పరచాలని ఆయన కోరారు. హెచ్ఈవో కృష్ణారెడ్డి, ఫార్మసిస్టు శ్రీధర్, సిబ్బంది మహేష్, భార్గవ్, స్టాఫ్ నర్సులు జ్యోతి, భానుమతి, విక్టోరియా, అన్ని గ్రామాల వెల్లర్స్ సెంటర్ల సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

ఒంగోలు: స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ప్రపంచ జనాభా దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా ప్రపంచంలో అనేక సమస్యలకు సవాల్‌గా మారిందన్నారు. దానిని నియంత్రించుకోవాల్సిన అవసరాన్ని గురించి వివరించారు. అర్థశాస్త్ర అధ్యాపకుడు సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జనాభా అతివేగంగా పెరగడం వల్ల ఏర్పడే ప్రధాన పరిణామాలు వాటి నివారణకు ఐక్యరాజ్యసమితి తీసుకుంటున్న ప్రధాన నివారణ చర్యలను వివరించారు. ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తూ ప్రపంచం యావత్తు పెరుగుతున్న జనాభాను నియంత్రించే చర్యలపై ఆలోచించే విధంగా కృషి చేస్తోందన్నారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దంత సమస్యలు అశ్రద్ధ చేయవద్దు



చిన్నారులను పరీక్షిస్తున్న దంత వైద్యులు

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు చిన్నతనం నుంచే దంత సమస్యలపై అవగాహన కలిగి చక్కగా దంత శుభ్రత పాటించాలని శ్రీసాయి ట్రిడెంట్ దంతవైద్యశాల నిపుణులు డాక్టర్ సాహితి వరదా, డాక్టర్ భూషణ్ చెప్పారు. గాంధీ పబ్లిక్ స్కూల్‌లో గురువారం స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో, ప్రిన్సిపాల్ మాధురి పర్యవేక్షణలో దంత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రతి రోజూ దంతాలను క్రమ పద్ధతిలో శుభ్రం చేసుకోవాలని తద్వార భవిష్యత్‌లో దంత సమస్యలు రావలని చెప్పారు. దంత సమస్యలపై అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ శ్రీ సాయి ట్రిడెంట్ దంత వైద్యశాల బృందం విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించి చిన తనం నుండి అప్రమత్తం చేయటం అభినందనీయమన్నారు.

19 నుంచి మహావేద సభలు



పంచమ మహా వేద కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డు అయ్యప్ప నగర్లో మురళీకృష్ణ మందిరం ఎదురు ఆలూరు సీతా రామమ్మ రామకోటేశ్వర రావు వేద పాఠశాలలో 19 నుంచి 21 వరకు ఆషాఢ పౌర్ణమి (గురుపౌర్ణమి) పురస్కరించుకుని మూడు రోజులు పాటు భారద్వాజ మహర్షి వేద విద్యా మండలి ఆధ్వర్యంలో పలుకార్యక్రమాలు జరగనున్నాయి. వేద విద్యా మండలి నిర్వాహకులు కంచి కామాక్షమ్మ శంకరమఠం అర్చకులు వట్టెం నాగేశ్వరరావులు.. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డిని వారి కార్యాలయంలో కలిసి శ్రీకృష్ణ యజుర్వేద జటాపారాయణం ఆహ్వాన కరపత్రాలను అందించి ఆహ్వానించారు. వేద పాఠశాలలో వేదం అభ్యసించే విద్యార్థులతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ భారతి

దర్శి: ప్రతి ఒక్క విద్యార్థి నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని దర్శి సీడీపీఓ సీహెచ్ భారతి పేర్కొన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులతో గురువారం మిషన్ శక్తి సంకల్పలో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ నూతన చట్టాలపై అవగాహన కలిగి వాటిని ఉపయోగించుకునే దిశగా ఉండాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె. అనూరాధ, జ్యోతి, రమా, అడ్వకేట్ మనోహరమ్మ పాల్గొన్నారు.